సత్తెనపల్లిలో జాబ్‌మేళా రేపు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించబోతున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లమో, ఫార్మసీ, పీజీ విద్యార్హత కలిగిన నిరుద్యోగులు, విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు రామకృష్ణారెడ్డి చరవాణి 8074393466, వీరాంజనేయులు 9160200652 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భారీ వర్షం.. ఉద్యాన పంటల రైతుల్లో గుబులు


రొంపిచర్లలో సాగు చేసిన పైరులో వర్షపు నీరు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రెండ్రోజులుగా జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. బుధవారం పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నరసరావుపేటలో మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో దట్టమైన మేఘాలు కమ్ముకుని అరగంట పాటు వాన దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీధుల్లో నీరు నిలిచి రాకపోకలు స్తంభించాయి. అచ్చంపేట మండలంలో భారీ వర్షం కురిసింది. చిలకలూరిపేటలో గంటపాటు వాన కురిసింది. రోడ్లన్నీ కాల్వలను తలపించాయి. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పెదకూరపాడు, అమరావతి మండలాల్లో వర్షం కురిసింది. బొల్లాపల్లిలో పొలాల్లో నీరు చేరింది. ఉద్యానవన పంటల రైతులు భయపడుతున్నారు. ఇదే రీతిన మరో రెండ్రోజులు కురిస్తే పొలాల్లో నీరు చేరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, మిరప, పొగాకు పొలాల్లో నీరు చేరి పంట కుళ్లిపోతుందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

మాచర్ల దారులకు మహర్దశ

నాలుగురోడ్లకు రూ.117.75 కోట్లు మంజూరు

ఈనాడు, నరసరావుపేట


లోయపల్లి నుంచి లచ్చంబావి తండాకు వెళ్లే మార్గం

పల్నాడు జిల్లాలో మారుమూల నియోజకవర్గమైన మాచర్ల నియోజకవర్గంలో నాలుగు రోడ్ల అభివృద్ధికి కేంద్రం రూ.117.75 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి(సీఆర్ఐఎఫ్) కింద నిధులు మంజూరు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్‌లో వెల్లడించారు. ఈమార్గాలన్నీ గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారులకు అనుసంధానమయ్యేవి కావడంతో ప్రగతికి బాటలు పడనున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, సత్రశాలను అనుసంధానం చేస్తూ ఆయా మార్గాలను విస్తరించనున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారులకు అనుసంధానం చేయడం వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుతో పాటు రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి. మాచర్ల నియోజకవర్గంలో సిమెంట్ కర్మాగారాలు ఉండటంతో రోడ్డు రవాణా ద్వారా వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచి సిమెంట్ సరఫరా అవుతోంది. ఈ క్రమంలో రోడ్ల ప్రాధాన్యం పెరిగింది. మాచర్ల మీదుగా ప్రయాణించే నకిరేకల్ నుంచి ఏర్పేడు జాతీయ రహదారి, నడికుడి నుంచి మాచర్లకు ఉన్న జాతీయ రహదారిని అనుసంధానం చేసే మార్గాలకు నిధులు మంజూరయ్యాయి. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. కేంద్రం ఏటా కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి నుంచి రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తుంది. అందులో భాగంగా రాష్ట్రంలో 13 రోడ్లకు నిధులు కేటాయించగా ఉమ్మడి జిల్లాలో ఒక్క మాచర్ల నియోజకవర్గానికి మాత్రమే నాలుగు రోడ్లకు నిధులు మంజూరుకావడం గమనార్హం. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు ఆయా మార్గాల అంచనాల తయారీ నుంచి నిధుల మంజూరు వరకు చొరవ చూపారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పల్నాడులో కేంద్రం వేస్తున్న జాతీయరహదారులు మినహా ఆర్అండ్‌బీ రహదారులపై దృష్టిసారించలేదు. దీంతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.

కేంద్రం నిధులు మంజూరు చేసిన రోడ్ల వివరాలు ఇలా....

రోడ్డు	కిలోమీటర్లు	నిధులు (రూ.కోట్లలో)
దుర్గి–వెల్దుర్తి	17.6	31.60
పాల్వాయిజంక్షన్ నుంచి సత్రశాల	11.29	21.65
మాచర్ల నుంచి వీపీసౌత్ వరకు	22.87	31.00
లోయపల్లి నుంచి లచ్చంబావి తండా	25.40	33.50

కొండమోడు-పేరేచర్ల రహదారిపై రయ్ రయ్

పేరేచర్ల - కొండమోడు మార్గానికి మహర్దశ పట్టనుంది. నాలుగు వరుసలుగా విస్తరించడానికి కేంద్రం నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. గతంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. అడ్డంకులను అధిగమించి ఎట్టకేలకు కేంద్రం అంగీకారం తెలపడంతో రోడ్డు విస్తరణ కార్యరూపం దాల్చనుంది.



❖ నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయనున్న కేంద్రం
❖ రూ.881.61కోట్ల నిధుల విడుదలకు ఆమోదం
❖ వాహనదారులకు తొలగనున్న కష్టాలు

ఈనాడు, నరసరావుపేట

కొండమోడు-పేరేచర్ల మార్గం విస్తరణకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌మాల కింద ఎంపిక చేశారు. 49.9 కి.మీ మార్గం నాలుగు వరుసలుగా విస్తరించడానికి నిరుడు ఆగస్టులో రూ.1032.52కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా రాజేంద్రసింగ్ బేంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. గుత్తేదారు ఎంపిక ప్రక్రియ పూర్తయినా నిధులు విడుదల చేయకపోవడంతో విస్తరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీనిపై సమీక్షించిన రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి భారత్‌మాల కింద ఉన్న రోడ్లను జాతీయ రహదారుల సాధారణ కార్యక్రమం(ఎన్‌హెచ్‌వో) కింద కొనసాగించాలని కోరారు.


కేంద్రం నిధులిస్తే రహదారి
కొండమోడు మార్గానికి మహర్దశ

ఈనాడులో ప్రచురితమైన కథనాలు

కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ అంగీకరించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. ఈమేరకు ప్రభుత్వం రూ.1032.52కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా రూ.881.61కోట్లకు గుత్తేదారు పనులు దక్కించుకున్నారు. ఈ రహదారి అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతపై 'ఈనాడు' గతంలో పలు కథనాలు ఇచ్చి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లింది.

కొన్నేళ్లుగా ఎదురుచూపులు

గుంటూరు నుంచి హైదరాబాద్ మార్గంలో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు మార్గాన్ని విస్తరించాలనేది దశాబ్దాల కల. ఈమార్గం అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రరహదారితో కొండమోడు వద్ద అనుసంధానమై హైదరాబాద్ వెళ్లేవారికి అనుకూలం. గుంటూరు నుంచి పల్నాడు ప్రాంతం వైపు వెళ్లేవారికి కొండమోడు మార్గం కీలకం. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు నుంచి గుంటూరు సమీపంలోని పేరేచర్ల వరకు జాతీయ రహదారి(167ఏజీ)గా కేంద్రం గుర్తించింది. వైకాపా ప్రభుత్వంలోనే కేంద్రం నిధులు మంజూరు చేసినా వివిధ కారణాలతో విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంతోపాటు ఆర్అండ్‌బీ మంత్రి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ మార్గం విస్తరణకు గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరించాలి. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లాల యంత్రాంగం పూర్తి చేసింది.

అత్యంత కీలకమైన మార్గం

గుంటూరు నుంచి పల్నాడు, హైదరాబాద్ వెళ్లేవారికి ఇది అత్యంత అనుకూలం. కొండమోడు-పేరేచర్ల మార్గం ప్రస్తుతం 7 నుంచి 10మీటర్ల వెడల్పుతో ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. విస్తరణ పూర్తయితే హైదరాబాద్ నుంచి రాజధాని అమరావతికి ప్రయాణ సమయం తగ్గుతుంది. సీఆర్‌డీఏ నిర్మించే బాహ్యవలయ రహదారికి సత్తెనపల్లి వద్ద ఈమార్గం అనుసంధానమవుతుంది. నాలుగు వరుసల విస్తరణలో ఒక్కొక్క వైపు 8.75 మీటర్ల వెడల్పు రహదారి, డివైడర్ 1.5 మీటర్లు, రెండువైపులా మార్జిన్‌లు కలిపి 22.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5 కిలోమీటర్లు బైపాస్, సత్తెనపల్లిలో 11 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు.

నెల రోజుల్లో పనులు ప్రారంభం



కొండమోడు-పేరేచర్ల రహదారి నాలుగు వరుసలుగా విస్తరణకు కేంద్రం నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. రూ.881.61 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండరు ప్రక్రియ పూర్తయి గుత్తేదారును ఎంపిక చేశారు. నెలరోజుల్లోనే పనులు ప్రారంభిస్తారు. భూసేకరణ ప్రక్రియ మొత్తం పూర్తయింది. రైతుల ఖాతాలకు నిధులు జమచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. **- లావుశ్రీకృష్ణదేవరాయలు, పార్లమెంటు సభ్యులు, నరసరావుపేట**

ఎమ్మెల్యేను కలుస్తారా.. లేదా?

నరసరావుపేటలో ఆ మూడు బార్ల యాజమాన్యాలకు వేధింపులు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: కొత్త మద్యం దుకాణాలకు సంబంధించి లాటరీ గెలుచుకున్న వారికి వేధింపులు ప్రారంభమయ్యాయి. నరసరావుపేటలో ఎమ్మెల్యేను కలుస్తారా? లేదా? అంటూ ఓ మూడు బార్ల యజమానులను వేధింపులకు గురిచేసినట్లు తెలుస్తోంది. బుధవారం జిల్లా కేంద్రంలో ఒక్క కొత్త దుకాణం కూడా తెరుచుకోలేదు. జీవన్‌జ్యోతి, ఆర్కే, బస్టాండ్‌కు సమీపంలోని ఓ బార్‌కు చెందిన వారిని బుధవారం ఉదయం పోలీసులు తమ స్టేషన్లకు పిలిపించుకున్నారు. టూటౌన్, వన్‌టౌన్ స్టేషన్‌ల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ బార్ సిబ్బందిని ఉంచి ఎమ్మెల్యేను కలుస్తారా? లేదా? అంటూ పోలీసులు ఇబ్బందులకు గురిచేసినట్లు సమాచారం. సిండికేట్‌లో భాగంగా స్థానికంగా మద్యం వ్యాపారులకే నరసరావుపేటలో దుకాణాలు లాటరీలో దక్కాయి. ఎమ్మెల్యే తాలుకా వారికి ఒక దుకాణమే దక్కింది. దీంతో వాటా విషయంలో పంచాయతీ తేలలేదు. దుకాణాలు ప్రారంభించే విషయంలో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఎమ్మెల్యేను కలవాలని లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారికి పోలీసులు చెబుతున్నారు. దీనికి వారు ససేమీరా అంటున్నారు. మంగళవారం రాత్రి కూడా 10 గంటలకే బార్లను మూయించారని బార్ల యజమానులు చెబుతున్నారు. అటు ఎక్సైజ్ సిబ్బంది మాత్రం తమ పరంగా చేయాల్సినవన్నీ చేశామని, లైసెన్స్‌లు జారీ చేయడం.. సరకు ఇవ్వడం వంటివి చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రైవేటు దుకాణాలకు మద్యం కేటాయింపు


గోదాములో నిల్వల పరిశీలనకు వెళుతున్న డీసీ శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్: గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని 256 ప్రైవేటు దుకాణాలకు మద్యం నిల్వలు కేటాయించామని అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట మద్యం డిపోను ఆయన బుధవారం సందర్శించారు. ఆరో వంతు ఫీజు చెల్లించి తాత్కాలిక లైసెన్స్ పొందిన దుకాణాల్లో విక్రయాలు ప్రారంభించేలా తమ శాఖ సహకరిస్తుందన్నారు. ప్రభుత్వ దుకాణాల్లో మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులతో పంచనామా చేయించి.. అందులోని నిల్వలు, సామాగ్రి వెనక్కి తెప్పించేందుకు చర్య తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో దుకాణాల కేటాయింపు వ్యవహారంపై సర్వత్రా దృష్టి పెట్టారని, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా తమ సిబ్బంది ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈఎస్ మణికంఠ, డిపో మేనేజరు (ఈఎస్) నాగేశ్వరరావు, ఏఈఎస్ దుర్గాప్రసాదు, ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి, సిబ్బంది ఉన్నారు.

'మంచి బుక్‌కు అర్థం తెలుసా జగన్'

వినుకొండ, వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : మంచి బుక్ రాస్తానంటున్న మాజీ సీఎం జగన్.. ఐదేళ్ల పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా చేశారని, ఒక్క ప్రాజెక్టు నిర్మించకుండా, పరిశ్రమలు పారిపోయేలా చేసి గంజాయి, అత్యాచారాలు, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం, జైలుకు పంపడం లాంటివి తప్ప చేసిన మంచి పని ఏంటో చెప్పగలరా అని మాజీ మంత్రి కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం వినుకొండలోని వై కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన పట్టభద్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగన్ మెదడు పని చేయట్లేదన్నారు. ఆ తీర్పును ఎంత కసితో ఇచ్చారో అదే విధంగా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గాడి తప్పిన వ్యవస్థను సక్రమ మార్గంలో పెట్టడానికి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మద్యం పాలసీ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు యువత మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలిపించి ఓటు ద్వారా జగన్‌ను తరిమేశారని, అదే కూటమి విజయానికి నాంది అన్నారు. ఈ ఎన్నికల్లో కూడా అదే రీతిలో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేతలు నిశ్శంకరావు శ్రీనివాసరావు, నాగశ్రీను, భాజపా నేత మేడం రమేష్, ఎన్నికల పరిశీలకుడు భూపతిరావు, అయూబ్‌ఖాన్ ప్రసంగించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

లింగ నిర్ధారిత వీర్యం

పాడి రైతులకు వరం

పెయ్య దూడలకు పెరుగుతున్న డిమాండ్

ఈనాడు, అమరావతి


పెయ్య దూడలను పరిశీలిస్తున్న అధికారులు

చూడి గేదెలు పెయ్యదూడలకు జన్మనిస్తే పశుపోషకులు మహాలక్ష్మిగా భావిస్తారు. ఆ దూడలే పుట్టేలా రూపొందించిన లింగ నిర్ధారిత వీర్య పరిజ్ఞానం క్రమంగా రైతులకు చేరువవుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ విధానంలో చేసిన కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ల ద్వారా పెయ్యదూడలు జన్మిస్తున్నాయి. పైగా 90 శాతం కచ్చితత్వం ఉంటోంది. ఇలా పుట్టిన దూడలు పూర్తి ఆరోగ్యంతో జీవిస్తున్నాయని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు పల్లెల్లో ఆవులు, గేదెలు పాల దిగుబడికి; ఎద్దులు, దున్నలు వ్యవసాయ పనుల్లో ఉపయోగపడేవి. ఇటీవలకాలంలో సాగులో యంత్ర పరికరాలు రావడంతో ఎద్దులు, దున్నల అవసరం చాలావరకు తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో రైతులు పాడి ద్వారా ఆదాయం కోసం పెయ్యదూడలనే కోరుకుంటున్నారు. ఇది గుర్తించిన ప్రభుత్వం సెక్స్ సార్టెడ్ సెమన్ (లింగ నిర్ధారిత వీర్యం) పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చారు. గతేడాది నుంచి ఉమ్మడిజిల్లాలో ఈ కృత్రిమ గర్భధారణ విజయవంతమవుతోంది.

పాడి రైతుల ఆసక్తి: ఉమ్మడి జిల్లాలో గేదెల ద్వారా పాల ఉత్పత్తి ఎక్కువ. ఒక గేదె పెయ్యకు జన్మనిస్తే అది మూడేళ్ల తరువాత గర్భం దాలుస్తుంది. ఈ గేదె ఖరీదు బహిరంగమార్కెట్లో రూ.60 వేల నుంచి రూ. లక్ష వరకు ఉంటోంది. అదే మగ దూడ ఖరీదు మూడేళ్లకు కేవలం రూ. 20 వేలే. పెయ్య గేదెగా మారితే 8 నుంచి 10 ఈతలు ఈనుతుంది. గేదె రోజుకు సగటున 6 లీటర్ల చొప్పున 8 నెలలపాటు పాలు ఇస్తుంది. లీటరు రూ. 60 చొప్పున లెక్కేస్తే రూ. 86,400 ఆదాయం వస్తుంది. ఇలా పది ఈతలు ఈనితే ఒక్క గేదె ద్వారా రూ. 8.64 లక్షలు వస్తుంది. గేదె సంతతి ద్వారా కూడా ఇదే విధంగా ఆదాయం వస్తుంది. అందువల్లనే పశుపోషకులు పెయ్యదూడలు పుట్టడానికి లింగ నిర్ధారిత వీర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు.

రాయితీతో ప్రోత్సాహకం

లింగ నిర్ధారిత వీర్య పరిజ్ఞానాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీ ఇస్తున్నారు. ఒక్కో ఇంజక్షను ఖరీదు రూ. 1,350 కాగా రైతులకు రూ. 500కే అందిస్తున్నారు. ఈ మొత్తం చెల్లిస్తే రెండుసార్లు ఇంజక్షన్ చేస్తారు. అప్పటికీ గర్భధారణ రాకపోతే ఆ మొత్తం తిరిగిచ్చేస్తారు.

❖ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు 40 వేలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో 4 వేలు లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్లు వేయాలని నిర్ణయించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి క్షేత్రస్థాయి యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అనేకమంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని గుంటూరు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహారావు తెలిపారు. అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు.

ట్రామాకేర్ కేంద్రాలు..

ఆపత్కాలంలో సంజీవనులు



రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలు, ఎముకలు విరగడం వంటివి జరుగుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం రహదారి ప్రమాదాల్లో గాయపడటం వల్ల ఏటా 50 లక్షల మంది మృతి చెందుతున్నారు. మన దేశంలో ఏటా 10లక్షల మంది చనిపోవడంతో పాటు రెండు కోట్ల మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. యువతలో సంభవించే మరణాల్లో రోడ్డు ప్రమాద మృతులే ఎక్కువ. అందులో 15-29 ఏళ్ల మధ్య వయసు వారే అధికం. జిల్లాల్లోనూ రాష్ట్రీయ, జాతీయ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, క్షతగాత్రులవుతున్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. 'వరల్డ్ ట్రామాడే' సందర్భంగా పల్నాడు జిల్లాలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

❖ ఏర్పాటుతోనే ప్రమాద బాధితులకు అత్యవసర వైద్యం
❖ ప్రపంచ ట్రామాకేర్ దినోత్సవ ప్రత్యేకం

న్యూస్‌టుడే, వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ

పల్నాడు జిల్లాలో గత ఏడాది 600 ప్రమాదాలు జరిగితే 350 మంది మృతిచెందగా 450 మంది గాయాలపాలయ్యారు. ఇందులో అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, తర్వాత కార్లు, జీపులు, ట్యాక్సీలు ప్రమాదానికి గురయ్యాయి. నరసరావుపేట డివిజన్ పరిధిలో 2022లో 337 ప్రమాదాలు చోటు చేసుకోగా 256 మంది మృతి చెందితే 193 మంది గాయాలపాలయ్యారు. 2023లో 250 ప్రమాదాలు నమోదు కాగా 220మంది ప్రాణాలు కోల్పోయారు. 169 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది ఇంచుమించు ఇదే పరిస్థితి. ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన వారు చాలామంది ఉన్నారు. ఎక్కువగా రాష్ట్ర రహదారులతో పాటు జిల్లా నుంచి వెళ్తున్న జాతీయ రహదారులైన చెన్నై-కోల్‌కతా, పిడుగురాళ్ల-వాడరేవు, అద్దంకి-నార్కట్‌పల్లి, అనంతపురం-గుంటూరు మార్గాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. జాతీయ, రాష్ట్ర రహదారుల సమీపంలోని పట్టణాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రామా కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.


ప్రమాద ఘటనా స్థలి (పాత చిత్రం)

సేవలు వేగంగా అందిస్తే మేలు

ప్రమాదం జరిగినప్పుడు శరీర భాగాల్లో ప్రధానంగా ఎముకలు విరుగుతుంటాయి. రక్తనాళాలు, నాడికణాలు తెగిపోతాయి. అవయవాల్లో రక్తస్రావం జరుగుతుంది. దీంతో చాలామంది మృత్యువాతపడతారు. ఆయా విభాగాలను ఒకేచోటుకు తెచ్చి అత్యవసర వైద్యం అందించడమే ట్రామాకేర్ వైద్యం. ఇందులో ఆర్థోపెడిక్ సర్జన్, అనస్తీఫియా, అత్యవసర వైద్య నిపుణుడు, న్యూరో, వాస్క్యులర్ సర్జన్లు ఈ కేంద్రంలో ఉంటారు. 24 గంటలు ఐసీయూ, వెంటిలేటర్లు, డయాలసిస్ కేంద్రంతో పాటు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉంటాయి. రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేస్తారు. గాయపడిన వారికి తక్షణమే వైద్య సాయం అందుతుంది. తద్వారా 90శాతం మేర బతికే అవకాశం ఉంటుంది.

జిల్లాలో..

జిల్లాలో నరసరావుపేట మినహా ఎక్కడా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులో లేదు. ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించి మరణాల సంఖ్య తగ్గించేందుకు ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉంది. చిలకలూరిపేటలో 100 పడకల ఆసుపత్రి ఉన్నా ఇప్పటి వరకు ఈ వసతి లేదు. వినుకొండకు మంజూరు చేస్తామని వైకాపా పాలనలో అప్పటి మంత్రి రజిని ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఈరెండింటితో పాటు సత్తెనపల్లి, మాచర్ల ఏరియా ఆసుపత్రులలో గాయపడిన వారికి సరైన వైద్యం అందని పరిస్థితి. ఇవి రెఫరల్ కేంద్రాలుగా పనిచేస్తున్నాయి తప్ప ట్రీట్‌మెంట్ అందించలేని దుస్థితి నెలకొంది.

కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లిలో ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటు ఆవశ్యకత ఉంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తాం. **- రంగారావు, వైద్యవిధాన పరిషత్ సమన్వయకర్త, పల్నాడు జిల్లా**

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక వాయిదా

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో బలపడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో పడుతున్న వర్షాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 17న సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించాల్సిన ఫుట్‌బాల్ అండర్- 14 బాలుర బాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక వాయిదా వేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. నందిగామ పాఠశాల ఆట స్థలంలో వర్షాలకు నీరు నిల్వటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. త్వరలో మళ్లీ ఎంపికలు చేపట్టే తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

18 నుంచి అండర్-19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 18వ తేది నుంచి నిర్వహించబోతున్నట్లు స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు బుధవారం తెలియజేశారు. ఈ నెల 18న నరసరావుపేట పట్టణంలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో బ్యాడ్మింటన్, 19న చిలకలూరిపేట ఏఎంజీ జూనియర్ కళాశాలలో హ్యాండ్‌బాల్, 21న సత్తెనపల్లి మండలంలోని నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో హాకీ, 22న ఖాజీపాలెం డాక్టర్ బీఎస్ రాజు జూనియర్ కళాశాలలో అథ్లెటిక్స్, 22న గుంటూరు బీఆర్ స్టేడియంలో టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, ఆర్చరీ, 23న నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్, సైక్లింగ్, నవంబరు 2వ తేదీన రావెల జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 1వ తేది తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, ప్రిన్సిపల్ ధ్రువీకరణతో పదో తరగతి మార్కుల జాబితాతో హాజరవ్వాలని కోరారు.

దుకాణం మూదే

❖ కేటాయించక ముందే మార్కెట్ యార్డు షాపులకు తాళాలు
❖ పాత, కొత్త నిర్వాహకుల మధ్య వాగ్వాదాలు


మార్కెట్‌యార్డు షాపింగ్ కాంప్లెక్స్

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : నరసరావుపేట మార్కెట్ యార్డు షాపుల కేటాయింపు కొలిక్కిరాక ముందే తమకు కేటాయించారంటూ కొందరు వాటి పాత తాళాలు పగులగొట్టి కొత్తవి వేస్తున్నారు. ఈ క్రమంలో పాత నిర్వాహకులకు, కొత్తవారి మధ్య వివాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఓ షాపు తనకు కేటాయించారంటూ ఒకరు వచ్చి షాపు తాళాలు పగులగొట్టాడు. ఇది తెలుసుకున్న పాత నిర్వాహకుడు వచ్చి తనకు చెప్పకుండా ఎలా తాళాలు పగులగొడతారని వాదనకు దిగగా అక్కడున్న వారు వారించి పంపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ హయాంలో షాపులు దక్కించుకున్నవారు షాపులు మూసివేశారు. తర్వాత అధికార పార్టీకి చెందిన వారు షాపులు తమకే కావాలంటూ ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఎవరికి కేటాయించారు అనేది తేలకుండానే కొందరు తెదేపా సానుభూతిపరులు షట్టర్లను పగులగొట్టి తాళాలు తీసి కొత్తవి వేస్తున్నారు.

పనిలో పనిగా డబ్బు వసూళ్లు

షాపులు కేటాయింపు కొలిక్కి రాకముందే తాము ఇప్పిస్తామని కొందరు అధికార పార్టీ నేతలు మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మకాం వేసి బేరసారాలు చేస్తున్నారు. ఒక్కొక్క షాపు ఇప్పించినందుకు రూ.లక్ష వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా మార్కెట్ యార్డు అధికారులు, ఎమ్మెల్యే ఈ విషయంపై దృష్టి సారించాల్సి ఉంది.

ఐదు వసతి గృహాలకు నూతన భవనాలు

❖ ఒక్కొక్కటి రూ.3 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదన
❖ పీఎం అజయ్ పథకం నిధుల కేటాయింపు

విసుకొండ, న్యూస్‌టుడే


వినుకొండ రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసయోగ్యంగా లేని ఎస్‌డబ్ల్యూ హాస్టల్ భవనం

వసతి గృహాల సంఖ్య 29
నివాసం ఉంటున్న విద్యార్థులు 3521

వినుకొండ రైల్వేస్టేషన్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 107 మంది విద్యార్థులున్నారు. 1985లో నిర్మించిన ఈ భవనం శిథిలదశకు చేరింది. పైకప్పు పెచ్చులూడి పడుతోంది. వర్షం కురిసినపుడు పిల్లలు బిక్కుబిక్కుమంటూ భయపడే పరిస్థితి. జిల్లా అధికారుల ఆదేశం మేరకు ఇటీవల ఖాళీ చేసి సీతయ్యనగర్‌లోని కళాశాల విద్యార్థులుండే అద్దె భవనంలోకి మార్చారు. అక్కడ ఇరుకుగా ఉన్నా తప్పని పరిస్థితిలో అక్కడే ఉంటున్నారు.

☛ ఇలాంటి వసతి గృహాల భవనాలు జిల్లాలో పలు చోట్ల ఉన్నా.. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఐదింటిని గుర్తించి మొదటి విడతలో వాటికి కొత్త భవనాలు కట్టించాలని నిర్ణయించారు. పీఎం అజయ్ పథకం కింద నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. ఒక్కొక్కటి రూ.3 కోట్లతో నిర్మించనున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి అధిక నిధులు మంజూరు కానున్నాయి.

☛ పల్నాడు జిల్లాలో ప్రీ, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో సొంత భవనాలున్నవి 19 కాగా వాటిల్లో 40 ఏళ్ల క్రితం నిర్మించినవి శిథిల దశకు చేరగా.. 15 ఏళ్లలోపు ఉన్న వాటిల్లో పెద్దగా ఇబ్బందులు లేవు. మిగిలిన పది అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పాత భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా పైసా రాలేదు. దీంతో వాటిల్లో విద్యార్థులు సర్దుకుని ఉంటున్నారు.

కొత్తవి ఇక్కడే..

❖ నరసరావుపేట, వినుకొండ, అమరావతి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలు
❖ గురజాల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం
❖ మాచర్ల కళాశాల బాలుర వసతి గృహం

ప్రతిపాదనలు పంపించాం

పూర్తిగా పాడైన వాటికి కొత్త భవనాలు నిర్మించాలని ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదల కాగానే పనులు మొదలు పెడతారు. మిగిలిన వాటి మరమ్మతులకు రూ.1.72 కోట్లు కావాలని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు ప్రభుత్వానికి పంపారు.
- ఓబులునాయుడు, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, పల్నాడు జిల్లా

రైతులు ముందుకు వస్తే ప్రోత్సాహకాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం కష్టంతో కూడుకున్నదని.. దానిని ఇష్టంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా కలెక్టర్ బంగ్లారోడ్డులోని కృషిభవన్‌లో బుధవారం మహిళా రైతు దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రసాయన రహిత ఆహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుని వాటిని మరింత మంది మహిళలకు తెలియజేయాలన్నారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలతో మంచి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ విధానంలో రైతులు ముందుకు రాకపోవడానికి కొన్ని కారణాలున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలకు ప్రత్యేక ధర లేకపోవడం, వాటిని ప్రత్యేకంగా గుర్తించకపోవడం వలన ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రభుత్వం తరపు నుంచి కూడా మరిన్ని రాయితీలు ఇస్తే ఎక్కువ మంది రైతులు ప్రకృతి సాగుకు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలవడం గొప్ప విషయమన్నారు. అనంతరం మహిళా రైతు తోలు విజయలక్ష్మిని సన్మానించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం


సుమంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, మాజీమంత్రి ఆలపాటి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం పట్టణంలోని ఫేమస్ ఫంక్షన్ హాలులో ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ- 2025 ఎన్నికల ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు జిల్లాల పరిధిలోని 33 నియోజకవర్గాల్లో గురజాల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకు వస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దాడులు చేయవద్దని ఆదేశించడంతో ఎక్కడా వివాదాస్పద ఘటనలకు తావు లేకుండా చేస్తున్నామన్నారు. వైకాపా నాయకుల మాదిరిగా అరాచకాలు చేస్తే రాష్ట్రానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిని అంకుశం సినిమాలో రామిరెడ్డిని కొట్టినట్లు కొట్టే రోజు వస్తుందని తెలిపారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా వైకాపా మాత్రం బతకకూడదని తెలిపారు. ఆ పార్టీని కూకటి వేళ్లతో కూల్చివేయాలని పిలుపునిచ్చారు. 2019 వరకు హౌస్ అరెస్టులు తెలియవని, వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత తెదేపా నాయకులు అవినీతిపై ఆందోళనలు చేయకుండా హౌస్ అరెస్టులు చేశారని గుర్తుచేశారు. 1977నాటి అత్యవసర పరిస్థితులు తెచ్చారన్నారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు నమోదును చేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌కు చెందిన పందిటి సుమంత్ కుమార్ నీట్‌లో ప్రతిభ కనబరచటంతో అతన్ని ఎమ్మెల్యే యరపతినేని, మాజీమంత్రి ఆలపాటి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావు, కర్నాటి వరలక్ష్మీ, జడ్పీటీసీ సభ్యులు జంగా వెంకట కోటయ్య, జనసేన నాయకుల కటకం అంకారావు తదితరులు పాల్గొన్నారు.

వాయుగుండ ప్రభావం.. పంటలకు నష్టం


ఐనవోలు రోడ్డుపై వాహనదారుల ఇబ్బందులు

నూజండ్ల : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఐనవోలులో వర్షం నీటితో పాటు పొలాల నీరు కూడా ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహించడంతో పూర్తిస్థాయిలో దెబ్బతింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువుకొమ్ముపాలెం చెరువు అలుగు నీరు పొంగి పీఆర్ రోడ్డుపై పారుతున్నాయి. పొగాకు, కంది, మిరప పంటలు దెబ్బతింటున్నాయి. పల్లపు ప్రాంతాల్లో పంటలు ఉరకెత్తుతున్నాయి. పమిడిపాడు- నూజండ్ల, గురపనాయుడుపాలెం- కంభంపాడు, ఐనవోలు రహదారుల్లో రాకపోకలు నిలిచాయి.

పులిచింతలకు పెరిగిన వరద ప్రవాహం

అచ్చంపేట, న్యూస్‌టుడే: పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. బుధవారం రాత్రి 8గంటలకు రెండు రేడియల్ గేట్లు ఎత్తి దిగువకు 41,546, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 కలిపి మొత్తం 57,546 క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్లు ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నుంచి 78,840 క్యూసెక్కులు వచ్చి చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టులో 42.16 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

వినుకొండ, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటంలో మాలలు పాల్గొనాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ కోరారు. బుధవారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. గౌరవ అధ్యక్షుడిగా పమిడిపల్లి ఇశ్రాయేలు, కార్యదర్శిగా దార్ల ఎర్రయ్య, గౌరవ సలహాదారుగా కొమ్మతోటి కృపయ్యను నియమించినట్లు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వర్గీకరణకు అనుకూలంగా ఉన్న రాజకీయ పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోండ్రు విజయ్, నియోజకవర్గ కార్య నిర్వాహక అధ్యక్షుడు కొట్టె వెంకట్రావు, అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపేయాలని నోటీసులు జారీ


ఫిర్యాదుదారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మధులత

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పట్టణంలోని హార్డ్ జూనియర్ కళాశాల ఎదుట కళాశాల స్థలంలో కొందరు ఆక్రమణ నిర్మాణాలు చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో మధులత, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు చేసిన కళాశాల ప్రిన్సిపల్ జి.ఫీబీ, స్టాఫ్ మెంబర్ లివింగ్‌స్టన్, బాప్టిస్ట్ క్రిస్టియన్ ప్రాపర్టీ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు జంగాల నవబాబులను విచారించి వివరాలు సేకరించారు. కళాశాలకు చెందిన సర్వే నంబర్ 1544లో పది సెంట్లు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేస్తున్నారని ఫిర్యాదు చేయగా అధికారులు వాటిని నిలిపివేయాలని ఆదేశించి నోటీసులు అంటించారు. ఈ స్థలం కోర్టులో ఉన్నందుకు నిర్మాణాలు ఎలా చేపడతారని, చట్టపరంగా నేరమని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నవారు తమ వద్ద ఉన్న అసలు పత్రాలు మున్సిపల్ అధికారులకు ఏడు రోజుల్లోగా అందజేయాలని, లేకుంటే నోటీసులు జారీ చేయకుండా అక్రమ కట్టడాలను తొలగిస్తామని హెచ్చరించారు. డీఎస్పీ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అధిక ఎరువుల వినియోగంతో నేల కాలుష్యం

పొడపాడు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: అధిక మోతాదులో ఎరువుల వినియోగంతో నేల కాలుష్యంతో పాటు రైతులకు పెట్టుబడి భారం పెరుగుతోందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి పల్లపోతు ప్రవీణ్ అన్నారు. బుధవారం పొడపాడులో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి శాంతి ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారి ప్రవీణ్

18న మినీ జాబ్ మేళా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఈనెల 18న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మేళా జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన యువత వివరాలకు 9866822697, 8790790762 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

బార్ యజమానికి పోలీసుల ఝలక్


మూతబడిన ప్రభుత్వ మద్యం దుకాణం

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : నరసరావుపేట పట్టణ శివారులోని ఓ బార్ యజమాని (తెదేపా మాజీ కౌన్సిలర్)కి పోలీసులు ఝలక్ ఇచ్చారు. అధికార పార్టీ ముఖ్యనేత ఆదేశంతో మంగళవారం రాత్రి 11 గంటలకు పోలీసులు బార్‌లోకి ప్రవేశించారు. అక్కడున్న మందుబాబులపై లాఠీలు ప్రయోగించారు. బార్ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. సదరు యజమాని భాగస్వామిగా ఉన్న సిండికేట్‌కు అధిక సంఖ్యలో మద్యం దుకాణాలు దక్కాయి. అయితే ఇందులో తమకు వాటాలు పంచడం లేదని అధికార పార్టీ నేత ఒకరు పోలీసు శాఖ సేవలను ఇలా ఉపయోగించుకున్నట్లు జిల్లా కేంద్రంలో చర్చ సాగుతోంది. దివంగత నేత ముఖ్య అనుచరుడొకరు జోక్యం చేసుకుని ఆ ముఖ్యనేతను ఇది సరైన పద్ధతి కాదంటూ హెచ్చరించారు. వాటాల వ్యవహారంపై తమ సమక్షంలో కూర్చొని మాట్లాడుకోవాలని ఉభయులకు ఆయన సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రైవేటు మద్యం నూతన దుకాణాలు తెరవకపోవడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వ దుకాణాలు రద్దు కాగా బార్లు మందుబాబులతో కిటకిటలాడాయి.

ప్రతిపేద కుటుంబానికి బీమా ఉండాలి

వినుకొండ, న్యూస్‌టుడే : సమాజంలో ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా బీమా ఉండాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ ఫొటో, వీడియోగ్రాఫర్లు 175 మందికి శివశక్తి ఫౌండేషన్ తరపున సొంత నిధులు బీమా ప్రీమియంగా చెల్లించి స్థానిక తెదేపా కార్యాలయంలో ఆ పత్రాలు అందజేశారు. అందరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు పొందిన కేశనుపల్లి సుబ్బారావును సన్మానించారు. ఇళ్లు లేని పేదలకు భవిష్యత్తులో కొంతమందికైనా ఇళ్లు నిర్మించి ఇస్తానని జీవీ చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలి


హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా బోధన అందించాలని గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. చిలకలూరిపేటలోని శారదా జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అన్ని తరగతులు తిరిగి పరిశీలన చేశారు. తరగతి గదుల్లో డిజిటల్ బోధనకు సంబంధించి ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ప్రశ్నించారు. హెచ్ఎం రత్నజ్యోతి గదిలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మెరుగైన విద్యాబోధన పాఠశాల ప్రగతికి తీసుకోవాల్సిన అంశాలు వివరించారు.

ఇప్పటికే నాడు- నేడు పనులపై చర్యలు తీసుకున్నాం..

శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్లో హెచ్ఎంగా పనిచేసి ప్రస్తుతం ఎంఈవో-2గా ఉన్న అరుణకుమారిపై చర్యలు తీసుకున్నట్లు ఆర్జేడీ పేర్కొన్నారు. పథకం కింద రూ.1.10 కోట్లు గతంలో మంజూరు కాగా. . గత పాఠశాల కమిటీ, హెచ్ఎం అరుణ కుమారి ఆధ్వర్యంలో పనులు చేసినట్లు చెప్పారు. అవి అసంపూర్తిగా ఉండటం, నిధులు మొత్తం ఖర్చు కావడంపై విచారణ చేసినట్లు చెప్పారు. దానిలో భాగంగా రూ. 21,66,630 నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి శాఖాపరమైన చర్యల్లో భాగంగా అరుణకుమారికి రెండు ఇంక్రిమెంట్లు తగ్గిస్తూ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసి, ప్రస్తుతం నాదెండ్లలో విధులు నిర్వహిస్తున్న ఒక ఉపాధ్యాయుడు వీటి వెనుక ఉన్నారని, ఆయనపై విచారణ చేపట్టి నిజమని తేలితే చర్యలు కఠినంగా ఉంటాయని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 505 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

వరద బాధితుల సహాయార్థం విరాళం

గుంటూరు, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం గుంటూరుకు చెందిన విజేత ఐఏటీ ఫౌండేషన్ డైరెక్టర్లు ఈ.వి.గిరిబాబు, ఎం.శ్రీనివాసరావు రూ.2.5 లక్షలు అందజేశారు. రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి ఈమేరకు చెక్కు అందజేశారు.

ప్రకృతి సాగు ఆహార పదార్థాలతో మేలు


నందిరాజుపాలెంలో గర్భిణికి ఆహార బుట్టను అందజేస్తున్న డీపీఎం అమల కుమారి

బెల్లంకొండ, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు తీసుకోవడంతో ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు కె.అమల అన్నారు. బుధవారం నందరాజుపాలెంలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఆహార బుట్ట పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రసాయన రహిత ఆహార పదార్థాలు పూర్తి స్థాయిలో తీసుకోవడం వల్ల అనారోగ్యం పైన ఖర్చు తగ్గి ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చన్నారు. ముందు రోజుల్లో ప్రతి గ్రామంలో కూడా అన్ని రకాల ఆహార పదార్థాలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో స్థానికంగా పండించే దిశగా సాగాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారుల తల్లులకు ఆహార బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్సు పర్సన్ బి.శైలజ, మౌనిక, పవన్, ధర్మతేజ, వీరమ్మ, అనంతలక్ష్మి, అంజలి, మహిళలు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణం.. చూడతరమా?


బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో నీరు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చిలకలూరిపేట బస్టాండ్‌లో ఆవరణలో నీరు నిలిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో, ప్రాంగణం నుంచి విద్యుత్తు కార్యాలయం వైపు వెళ్లే దారిలో సైకిల్ స్టాండ్ ముందే నీరు ఉన్నాయి. దీంతో ప్రయాణికులు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

యడ్లపాడు: భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రూపకల్పన చేసిన రెవెన్యూ సదస్సులను భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ 18 నుంచి వచ్చేనెల 2 వరకు మండలంలో గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రీసర్వేలో జరిగిన పొరపాట్లు, ఇతర భూ సమస్యలపై భూ యజమానులు సదస్సుల్లో అర్జీలు అందజేయాలని వెల్లడించారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

నాదెండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఎండుగుంపాలెంలో గురువారం నిర్వహించనున్న 'పల్లె పండగ' కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతాంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ఏపూరి గోపాలరావు అన్నారు. మండలంలోని సంతగుడిపాడులో బుధవారం రొంపిచర్ల మండల శాఖ ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, మల్లు స్వరాజ్యం, ప్రొఫెసర్ సాయిబాబాకు సంతాపం తెలిపారు. కార్యక్రమానికి సరికొండ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఏపూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక కొరత వల్ల కొన్ని లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నారన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి రుణాలు ఇవ్వాలని కోరారు. రొంపిచర్ల శాఖ కార్యదర్శిగా అంగులూరి వణిర్థ, సంతగుడిపాడు బండారుపల్లి నాగేశ్వరరావు, పరగటిచర్ల పొట్టూరి అంజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా నేత శివకుమారి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? గత ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో నా సాగుభూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఆన్‌లైన్‌లోకి ఎక్కించేలా చూడాలి.
-కల్లూరి శ్రీనివాసరావు, యడ్లపాడు

✔ త్వరలో నిర్వహించే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకుంటే సమస్య పరిష్కరిస్తాం. **-విజయశ్రీ, తహసీల్దార్**, –యడ్లపాడు, న్యూస్‌టుడే

? ఆన్‌లైన్‌లో ఇసుక తక్కువ పరిణామంలో ఉంచుతున్నారు. బుక్ చేసుకునే సమయానికి నిల్వ మాయం అవుతోంది. ఇంటి నిర్మాణానికి ఇబ్బంది పడుతున్నాం. **-వజ్జా రాఘవయ్య, కనపర్రు, నాదెండ్ల మండలం**

✔ మాదిపాడు డప్పింగ్ యార్డులో తక్కువగా నిల్వ ఉంది. మరో ఆరు రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అనుమతిస్తున్నాం. మరో పది రోజుల్లో ఆఫ్‌లైన్ పద్ధతిలో కూడా లభిస్తుంది.
-యంపరాల నాగయ్య, గనులు భూగర్భ శాఖ అధికారి, పల్నాడు జిల్లా

? బరంపేట బైపాస్ రోడ్డులో జెండా చెట్టు వద్ద వర్షం కురిసినప్పుడు మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. **-పవన్ కుమార్, బరంపేట, నరసరావుపేట**

✔ పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నాం. అక్కడ మురుగు నీరు వెళ్లేందుకు తూము చిన్నది కావడంతో కొత్త కల్వర్టు నిర్మాణానికి చర్య తీసుకుంటాం. **- జస్వంతరావు, కమిషనర్, పురపాలక సంఘం, నరసరావుపేట.** –న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్

ఖాళీ స్థలాలతో భయం భయం

బురద రోడ్లతో అవస్థలు ★ ఎన్జీవో కాలనీవాసుల సమస్యలు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే

నరసరావుపేట ఎన్జీవో కాలనీలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సుమారు నాలుగు వేలకు పైగా జనాభా ఉన్నా మురుగు, సీసీ రోడ్ల కొరతతో పాటు ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి భయాందోళనలో కాలం వెల్లదీస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం కాలనీని పూర్తిగా విస్మరించడంతో మురుగు వ్యవస్థ సరిగా లేక అవస్థలు పడ్డామని, పలు వీధుల్లో కాలువలు లేక ఇళ్ల మధ్య మురుగు చేరి దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు.

★ కాలనీ మొదటి లైను శివారున పగలు వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. రాత్రివేళ వెలగక అంధకారం నెలకుంటోంది. విద్యుత్తు అధికారులను అడిగితే మున్సిపల్ సిబ్బందే వీధి దీపాలు పర్యవేక్షిస్తున్నారని అంటున్నారు. వీధి దీపాలు అమర్చమని చెప్పినా పట్టించుకోలేదు.



రోడ్డుకు సగంపైగా పగిలి గుంతలా మారిన కల్వర్టు



ఖాళీ స్థలాల్లో పేరుకున్న పిచ్చిచెట్లు

★ కాలనీలోని ఏడు లైన్లలో పాతికకు పైగా ఖాళీ స్థలాలున్నాయి. వీటిలో దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు వస్తున్నాయి. పచ్చిక పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఐదో లైను ప్రారంభం ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో మురుగు కాలువపై కల్వర్టు పగిలి ఇనుప చువ్వలు పైకి తేలాయి. కాలనీ రోడ్లను అనుసంధానం చేసే మట్టిరోడ్లు కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అభాగ్యుల ప్రాణాలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఎంతోమంది అభాగ్యుల ప్రాణాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేటకు చెందిన తిరుమలయ్య, రాజేశ్వరి దంపతుల కవల పిల్లలు అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందారు. వీరికి మంజూరైన రూ.4 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బుధవారం వారికి అందించి ఆయన మాట్లాడారు. తెదేపా నాయకులు ఉన్నారు.



బాధితులకు రూ.4 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పక్కన తెదేపా నాయకులు

మెగా ఉచిత వైద్య శిబిరం

చిలకలూరిపేట పట్టణం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ జన్మదినం పురస్కరించుకుని స్థానిక తూర్పుమాలపల్లిలో తెదేపా, టీఎంటీ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం కాటూరి వైద్య కళాశాల వైద్యుల సౌజన్యంతో నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం తన కుమారుడు శరత్ పుట్టిన రోజు కేకు ఆయన కోశారు. వైద్యులు పలువురిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీఎంటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట గ్రామీణ : మండలంలోని మురికిపూడిలో రూ.60 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న పనులకు బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. రూ.60లక్షలతో బైపాస్ రోడ్డు నిర్మాణం రూ.15 లక్షలతో సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. నేతలు పాల్గొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ అప్పగింత

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మార్టూరు మండలం రాజుపాలేనికి చెందిన గణేష్‌బాబు చిలకలూరిపేట మండలం తాతపూడి సమీపంలో సెల్‌ఫోన్ పోయినట్లు మంగళవారం ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ వెంటనే స్పందించి బాధితుడి చరవాణి రికవరీ చేసి అందించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి

శావల్యాపురం, న్యూస్‌టుడే : పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి బలపర్చిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ కోరారు. బుధవారం శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారిస్తామని పేర్కొన్నారు. పట్టభద్రులు తమ ఓటును నవంబరు 6లోపు నమోదు చేయించుకోవాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయిని బొడ్డపాటి విజయలక్ష్మితో పాఠశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ తదితరులు

సమస్యల పరిష్కారానికి ఫోన్ నంబరు

వినుకొండ, వినుకొండ రూరల్: సమస్యలు వస్తే తనని సంప్రదించలేని వారు వెంటనే టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇస్తే పార్టీపరంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. తిమ్మాయిపాలెం రోడ్డులోని కల్యాణ మండపంలో నిర్వహించిన తెదేపా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమయంలోనైనా 7075527666 నంబరుకు కాల్ చేయడంతో పాటు వాట్సాప్ చేయాలని పేర్కొన్నారు.

పార్టీ సభ్యత్వమంటే చిరునామా

తెదేపా సభ్యత్వం ఉంటే అది చిరునామాతో సమానమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. వినుకొండ నుంచి ఎక్కువ సభ్యత్వాలు ఉండేలా పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు, నేతలు కష్టపడి పని చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు సభ్యత్వం ఉన్న వారికి ప్రమాదం జరిగితే రూ.2 లక్షలు బీమా ఉండేదని ఇక నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రకటించారు.

ప్రతి పల్లెకు రహదారి వసతి



ముర్తింజాపురంలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, నేతలు

నూజండ్ల, న్యూస్‌టుడే : పల్లె పండగ కార్యక్రమంతో పంచాయతీలకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు జడ్డా సుబ్బులు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం ముర్తింజాపురం, నాగిరెడ్డిపల్లెలు, చింతలచెరువు, ఐనవోలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ఉమాదేవి, ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, తెదేపా నేతలు ముంద్రు సుబ్బారావు, వంకాయలపాటి పేరయ్య, జడ్డా రామయ్య, బుల్లెయ్య పాల్గొన్నారు.

యడ్లపాడు : 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపాలెం, కోట, సొలసలో అధికారులు, తెదేపా నేతల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.33 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి శ్రీనివాస రెడ్డి, సర్పంచి సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో రామారావు, తెదేపా నేతలు కామినేని సాయిబాబు, బద్దేటి శివకోటి, అంకారావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



రొంపిచర్ల : సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తెదేపా నేతలు, అధికారులు

రొంపిచర్ల: ప్రతి పల్లెకు రహదారి, ప్రతి వీధిలో సీసీ రోడ్డు వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏపీవో కోట ప్రసాద్ అన్నారు. మండలంలోని ఆరేపల్లి, రామిరెడ్డిపాలెంలో బుధవారం సిమెంటు రోడ్డు నిర్మాణానికి తెదేపా నేతలు, స్థానికులు, అధికారులు శంకుస్థాపన చేశారు.

నరసరావుపేట సెంట్రల్: పల్లె పండగతో గ్రామాలకు పూర్వ వైభవం వస్తోందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం మండలంలోని దొండపాడు, పెద్దరెడ్డిపాలెం, ములకలూరు, అగ్రహారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆర్డీవో మధులత, తెదేపా నేతలు పాల్గొన్నారు.

వైద్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : డిగ్రీ, పీజీ చదివి 17 ఏళ్లుగా రెండువేల మంది తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, దీంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని, తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును వైద్య మిత్రల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి కోరారు. సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని నేతలు హామీ ఇచ్చారు.

20న ఎముకల దృఢత్వ ఉచిత పరీక్షలు

వినుకొండ : ప్రపంచ ఆస్టోఫోరోసిస్ డే సందర్భంగా ఈనెల 20న దత్త సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచితంగా ఎముకల దృఢత్వ (బీఎండీ) పరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి ఎండీ, డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మరో వైద్యుడు అభిషేక్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల ఆందోళన

నరసరావుపేట సెంట్రల్ : కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ విభాగంలో తొలగించిన 55 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే 20 నుంచి పారిశుద్ధ్య కార్మికులంతా సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో సాల్మన్, యోహన్, అల్లాభక్షు, నాగమల్లేశ్వరి, రమాదేవి, సుభాని, సైదా, రమణ, పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు.

శావల్యాపురంలో కొండచిలువ కలకలం

శావల్యాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన శావల్యాపురంలోని చెరుకూరి వారి వీధిలో కొండచిలువ కలకలంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వారం క్రితం బాజ్జి ఇంటి ఆవరణలో అది పడుకుని ఉండగా పట్టించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో పక్కకు వెళ్లింది. అప్పటి నుంచి మహిళలు, చిన్నారులు ఆందోళనలో ఉన్నారు. తిరిగి మంగళవారం రాత్రి స్వీట్ బండి వారి ఇంటి ఆవరణలోకి వచ్చింది. వెంటనే వారు కర్రతో బయటకు పంపారు. రాత్రి వేళ చిన్న పిల్లలు ఆరు బయట ఆడుకుంటారని, ఆ సమయంలో అది సంచరిస్తే ప్రాణాపాయమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి దాన్ని పట్టి.. దూరంగా వదలాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించరా?

వినుకొండ రూరల్ : పదేళ్లుగా ఆరు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక రైతులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘ మండల కార్యదర్శి ముని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వినుకొండ నుంచి భారతాపురం, నడిగడ్డ వెళ్లే మార్గంలో ఐదేళ్ల క్రితం ఉన్న రోడ్డు తొలగించి కంకర పరిచి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర కష్టాలు పడుతున్నట్లు చెప్పారు. సమస్య పరిష్కరించకపోతే విద్యార్థులు, రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

సమయపాలన పాటించాలి

వినుకొండ రూరల్ : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎల్‌డీవో వెంకటరెడ్డి సూచించారు. బుధవారం కొత్తపేట 1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు.

నట్టల నివారణ మందు పంపిణీ

వేల్పూరు (శావల్యాపురం) : పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని జడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి తెలిపారు. బుధవారం గ్రామంలో గొర్రెలు, మేకలు పెంపకందారులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. సర్పంచి బీర్నీడి రత్నగిరి, ఎంపీటీసీ-1 లింగా శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్, పున్నయ్య పాల్గొన్నారు.

నూజండ్ల : వర్షాలకు పంటలు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులకు మండల వ్యవసాయాధికారి సుగుణా బేగం సూచించారు. అప్పాపురం, మారెళ్లవారిపాలెంలో వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కంది, మిరప, పొగాకు వర్షాలకు దెబ్బతినే పరిస్థితి ఉందని, కందిలో వచ్చే వెర్రి తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

నరసరావుపేట సెంట్రల్ : మండలంలోని కాకానిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మస్తానమ్మ కంది పొలాలు పరిశీలించి.. ఆకుచుట్టు పురుగు ఉందని, దాని నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్, 2.0 మిలీ క్వీనాల్‌ఫాస్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేంద్రబాబు, వీఏఏ నాగరాజు, మల్లికార్జునరావు, ఏహెచ్ఏ వెంకటరమ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెదకూరపాడు, న్యూస్‌టుడే : పెదకూరపాడులో విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో బాటుగా విద్యుత్తు స్తంభాల వెంబడి చెట్ల కొమ్మలు తొలగిస్తున్న కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలి

గురజాల (గ్రామీణ, న్యూస్‌టుడే): ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని, ఎల్‌ఐసీ పాత పాలసీ పద్ధతిలోనే కొనసాగించాలని ఎల్‌ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, మాధవరావు, రామచంద్రరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. గురజాల పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పట్టణంలోని నాలుగోవార్డులో సాధువమ్మ వసతిగృహం సమీపంలోని మురుగు కాల్వ వద్ద రోడ్డుపైనే చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు, నాలుగోవార్డు**

✔ ప్రజారోగ్య సిబ్బందితో చెత్త, వ్యర్థాలు తొలగింపజేస్తాం. రోడ్డుపై చెత్త, వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటాం.
- షమ్మి, మున్సిపల్ కమిషనర్ -న్యూస్‌టుడే, సత్తెనపల్లి

స.హ చట్టంపై అవగాహన

అమరావతి, న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టంపై మండల ఏవో కార్యాలయంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. యంత్రాంగంలో జవాబుదారీతనం, పారదర్శకత తీసుకురావడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని ఏవో ఆహ్లాద అన్నారు. అందరూ ఈ చట్టాన్ని ఉపయోగించుకొని అన్ని శాఖలలో సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠ

75త్యాళ్లూరు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: 75త్యాళ్లూరు ఎస్సీ కాలనీలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ బుధవారం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆర్థిక తోడ్పాటుతో జీర్ణోద్ధరణకు గురైన బొడ్రాయిని వేద పండితుల ఆశీర్వచనాల నడుమ పునః ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, మాజీ ఎంపీపీ గళ్లా బాబులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు.



బొడ్రాయికి పూజలు చేస్తున్న తెదేపా నేతలు

దశాబ్దాల నిరీక్షణకు తెర దించేనా?

❖ సత్తెనపల్లిలో తీరని రైల్వే గేటు సమస్య ❖ ప్రజలకు నిత్యం నరకం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

సత్తెనపల్లిలో పట్టణీకరణకు తగ్గట్లుగా మాచర్ల, పిడుగురాళ్ల, నరసరావుపేట వైపునకు కొత్త కాలనీలు ఏర్పడుతున్నా మూడున్నర దశాబ్దాలుగా రైల్వేగేటు సమస్య మాత్రం తీరడం లేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అచ్చంపేట రోడ్డు వైపునకు అభివృద్ధి లేకపోయేందుకు రైల్వేగేటు ప్రధాన అడ్డంకిగా మారుతోంది. రూ.లక్షలు వెచ్చించి పక్కా ఇళ్లు నిర్మించుకున్న వారు సైతం గేటు గోడు పడలేక ఇటువైపునకు వచ్చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోకి రోజూ వచ్చే వారు వర్ణనాతీత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019 జనవరిలో ఆర్‌వోబీ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు ఆర్‌వోబీ నిర్మాణాన్ని చేపట్టకుండా కాలయాపన చేసింది.



అచ్చంపేట రోడ్డులోని గేటు పడిన సమయంలో పరిస్థితి ఇలా..

20 నిమిషాలకు పైగా ఎదురు చూపులు

అచ్చంపేట రైల్వేగేటు వద్ద గేటు పడిన ప్రతిసారి 8 నుంచి 10 నిమిషాల పాటు వేచిచూడాలి. రెండు రైళ్లు ఒకేసారి వస్తే ఎదురుచూపులకు 10 నిమిషాలకుతోడు ట్రాఫిక్ చక్కదిద్దేందుకు పట్టే మరో 20 నుంచి 30 నిమిషాల సమయం వరకు అక్కడే వేచిచూడాల్సిందే. అంబేడ్కర్ నగర్, రంగా కాలనీ, లెనిన్ నగర్, భీమవరం రోడ్డు, పాత, కొత్త సుగాలి కాలనీలు, ముస్లింపేట, రైల్వేస్టేషన్ రోడ్డు వాసులతో పాటు సత్తెనపల్లి, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాల పరిధిలోని సుమారు 30 గ్రామాల ప్రజలు పట్టణంలోకి రావాలంటే నానా అవస్థలు పడాల్సిందే.

రైల్వేస్టేషన్‌కు ఒకవైపు అచ్చంపేట గేటు ఉండగా మరోవైపు భీమవరం రోడ్డు గేటు ఉంది. దాంతో కూడా సమస్యలు ఉన్నాయి. వరుసగా గేట్లు పడటంతో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఆ సమయంలో పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు, వచ్చే రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అత్యవసర వైద్యసేవల బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది.



ప్రమాదకరంగా గేటు దాటుతున్న వాహన చోదకులు

కాగితాలకే పరిమితమా..

తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.92 కోట్లతో ఆర్‌వోబీతో పాటు సర్వీసు రోడ్లు 100 మీటర్ల మేరకు నిర్మించాలనే ఆలోచన చేశారు. 2019 జనవరి 18వ తేదిన ఆర్‌వోబీ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. మూడేళ్లక్రితం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రైల్వేశాఖ ఉన్నతాధికారులతో కలసి రైల్వేగేటు సమస్యను స్వయంగా పరిశీలించి నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ ప్రకటించినా ఫలితం లేకపోయింది. ఈ ఏడాదిలో ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో రైల్వేగేటు సమస్య పరిష్కరిస్తామని ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారు. కాగితాలకే ఆర్‌వోబీ నిర్మాణాన్ని పరిమితం చేయకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పేద విద్యార్థులకు ఎమ్మెల్యే సాయం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన పందిటి సైదులు కుమారుడు సుమంత్‌కుమార్ కష్టపడి చదివి నీట్‌లో అర్హత సాధించి, రాజమండ్రి కళాశాలలో సీటు సాధించారు. ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకు వచ్చారు. ఎమ్మెల్యే స్పందించి అతను కళాశాల ఫీజు కట్టడానికి ఎమ్మెల్యే యరపతినేని రూ.50వేల నగదును అందజేసి, ఐదేళ్ల పాటు ఏటా రూ.50 వేలు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన మరో మాజీ సభ్యుడు చెరువుపల్లి మరియదాసు కుమారుడు నవదీప్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో నవదీప్ చదువుకు రూ.25వేలు ఆర్థిక సహాయం చేశారు.

గ్రామ రెవెన్యూ సదస్సులు

గురజాల, చౌటపాపాయపాలెం(రాజుపాలెం), న్యూస్‌టుడే : తెలుకుట్లలో 18న, పులిపాడు గ్రామంలో 19న రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నరేష్ తెలిపారు. ఆయా గ్రామాల్లో రీ- సర్వే పూర్తయిన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సుల్లో పరిష్కారం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. చౌటపాపాయపాలెంలో గతంలో జరిగిన భూముల రీ-సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈనెల 18న గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నెమలిపురి దుర్గేశ్వరరావు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చివరి భూములకు నీరందిస్తాం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : రైతు మోములో చిరునవ్వు చూసేలా ఆయకట్టు సాగుదారుల చివరి భూములకు మేజరు నీటిని అందిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం కారంపూడి మండల పరిధిలోని డీసీ 3లో ఉన్న రామాపురం మేజరులోని పూడికతీత పనులతో పాటు కాలువ కట్టలపై పెరిగిన పిచ్చిచెట్ల తొలగింపులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..రామాపురం మేజరు పరిధిలోని 32 వేల ఎకరాల సాగు భూములకు పూర్తి స్థాయిలో నీరు చేరేలా పనులు చేస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోలేదని, కాలువల ద్వారా సాగు నీరందించే మేజర్లు, మైనర్ల పనులు చేయకపోవటంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నూతనంగా నిర్మించనున్న బస్టాండ్‌కు భూమి పూజ చేశారు.

ప్రారంభమైన తుల్జా భవానీ కొలుపులు

దుర్గి,న్యూస్‌టుడే : మండల పరిధిలోని రాజనగర్‌లో తుల్జా భవానీ కొలుపులు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు.

గ్రామాభివృద్ధే పల్లెపండగ ధ్యేయం

ముప్పాళ్ల,అమరావతి, క్రోసూరు(అచ్చంపేట), గురజాల గ్రామీణ, దుర్గి, రెంటచింతల, రాజుపాలెం, న్యూస్‌టుడే : జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనతో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, వ్యవస్థలన్నింటినీ గాడినపెట్టి అభివృద్ధి పరుగులు తీయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ముప్పాళ్ల, మాదల గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.47 లక్షలు విలువచేసే అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజలు చేశారు. ఈ కన్నా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే పల్లె పండగ ధ్యేయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల రూపురేఖలు మారుస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా నార్నెపాడు వైకాపా ఎంపీటీసీ సభ్యురాలు మణికె ఏసమ్మ ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో గ్రామాలను అభివృద్ధికి దూరం చేశారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఎనికపాడు, అమరావతిలో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొని రహదారులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా పెదకూరపాడును తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెదేపా నేతలు భాష్యం జగదీష్, విష్ణు, వసంతరావు, శౌరయ్య, అమర్ తదితరులు పాల్గొన్నారు. క్రోసూరు మండలంలోని ఆవులవారిపాలెం, పీసపాడు, 88త్యాళ్లూరు గ్రామాల్లో బుధవారం పల్లెపండగ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. చిగురుపాడు గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు ఎన్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు పశువుల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని అంబడిపూడి, రుద్రవరం, ఒక్కొక్కటి రూ.2.30లక్షలతో షెడ్లు నిర్మాణం చేపట్టినట్లు ఉపాధిహామీ ఏపీవో నాగశ్రీనివాస్ పేర్కొన్నారు. గంగరంలో రూ.15 లక్షలతో సీసీ రహదారులకు, మురుగుకాలువల నిర్మాణానికి తెదేపా నేతలు శ్రీకారం చుట్టారు. దుర్గి మండలంలోని శ్యామరాజుపురం, ధర్మవరం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ20 లక్షలతో నిర్మాణాలు చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు బుధవారం మాచర్ల యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు, మండల తెదేపా నాయకుడు ఏచూరి సాయిశంకర్ భూమిపూజ నిర్వహించారు. రెంటచింతల మండలంలోని పాలువాయి రూ.20 లక్షలు, , పశర్లపాడులో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు ఎంపీడీవో సరోజినీదేవి భూమిపూజ చేశారు. రాజుపాలెం మండలంలోని చౌటపాపాయపాలెం, కొత్తబోధనం, రాజుపాలెం గ్రామాల్లో సిమెంటు రహదారులు, గోకులం షెడ్ల నిర్మాణాలకు తెదేపా మండల అధ్యక్షుడు పల్లపాటి పెదద్దిరాజు శంకుస్థాపన చేశారు.



భూమిపూజలో ఎమ్మెల్యే కన్నా, అధికారులు, నాయకులు



ఎనికపాడు రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పిల్లలతో ఏంటీ పనులు?

పట్టణంలోని నాగార్జున నగర్‌లోని ఎంపీయూపీ(హ్యారిస్) పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న తరువాత ప్లేట్లు కడుక్కునేందుకు విద్యార్థులు ప్రయాస పడుతున్నారు. పాఠశాలలో విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు సరైన నీటి వ్యవస్థ లేదు. దీంతో ఒక దబరాలో నీళ్లుపోసి అందులో నీటితోనే చేతులు, ప్లేట్లు శుభ్రం చేస్తున్నారు. విద్యార్థులు తిన్న ప్లేట్లను మధ్యాహ్న భోజన ఏజన్సీల బాధ్యులు శుభ్రం చేయాల్సి ఉండగా ఆ పని పిల్లలకే అప్పగిస్తున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాసలు పడుతూ విద్యార్థులు ప్లేట్లు కడుగుతున్నారు. **-న్యూస్‌టుడే, సత్తెనపల్లి**



తాగునీటి పథకం మరమ్మతులకు రూ.40 లక్షలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : నియోజకవర్గ పరిధిలోని దుర్గి మండలం ధర్మవరం తాగునీటి పథకం మరమ్మతులకు రూ.40 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమారరాజు తెలిపారు. బుధవారం మాచర్లలోని గ్రామీణ నీటి పారుదల శాఖ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ధర్మవరం పథకం ద్వారా 7 గ్రామాలకు తాగునీరు అందుతుందని, పథకం పరిధిలోని స్లోశాండ్ ఫిల్టర్ దెబ్బతినడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి చొరవతో జిల్లా పరిషత్ నిధులు రూ. 40 లక్షలు మరమ్మతుల కోసం మంజూరు చేశారని వివరించారు. త్వరలో మరమ్మతులు పూర్తి చేసి తాగునీటిని అందిస్తామని తెలిపారు.

104 సేవల తనిఖీ

పెదకూరపాడు: పెదకూరపాడు 1వ సెంటర్ పరిధిలో 104 వైద్య సేవలను నోడల్ అధికారి హనుమకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి చికిత్స అందిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. . అనంతరం 75 త్యాళ్లూరు పీహెచ్‌సీ తనిఖీ పరిశీలించి ఆసుపత్రిలోని పలు దస్త్రాలు, ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలు నమోదు చేసుకున్నారు.

నవంబరు 6లోపు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

దుర్గి, న్యూస్‌టుడే : మండలంలోని పట్టభద్రులు తమ ఓటును నవంబరు 6లోపు నమోదు చేసుకోవాలని ఎస్టీయూ రాష్ట, జిల్లా నాయకులు జీసీహెచ్ అనంతరామయ్య, ఎర్రం ఏడుకొండలు అన్నారు. బుధవారం మండలంలోని ఉపాధ్యాయులను, పట్టభద్రులను ఎస్టీయూ నాయకులు వ్యక్తిగతంగా కలసి ఓటు నమోదు సంబంధించిన ఫారం -18లను అందజేశారు.

చర్లగుడిపాడులో పొలం పిలుస్తోంది

గురజాల, న్యూస్‌టుడే : చర్లగుడిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి సంధ్యారాణి నేతృత్వంలో నిర్వహించారు. వరి పొలాల్లో ఆకు చుట్టు పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉందని, 5 శాతం వేపగింజల కషాయం లేదా, అజాడి రెక్టిన్ 10,000 పీపీఎం, 200 ఎంల్ ఎకరాకు, లేదా క్లోరిఫయర్ పాస్ 500 ఎం.ఎల్. పిచికారి చేస్తే దానిని నివారించవచ్చని రైతులకు సూచించారు.

సమస్యలపై చర్చిస్తేనే.. ప్రజలకు భరోసా

బెల్లంకొండ, న్యూస్‌టుడే : మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు చక్కటి వేదికగా మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం అని ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా అన్నారు. బుధవారం బెల్లంకొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశ కార్యక్రమంలో ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో హనుమారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రధాన మురుగునీరు ప్రవహించే కాలువలో పూడిక పేరుకు పోయి ఎక్కడికక్కడ నీరు నిలిచి పోతుండటంతో వర్షాలకు వార్డులోని మురుగునీరు రహదారుల పైకి వస్తుందని సమస్య పరిష్కారానికి పూడికతీత పనులు ప్రారంభించామని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. బుధవారం పట్టణంలోని 30వ వార్డులో ఉన్న ప్రధాన మురుగుకాల్వల పూడిక తీత పనులను పొక్లెయిన్ సాయంతో చేపట్టారు.

సమస్యల వలయంలో సత్తెనపల్లి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమస్య స్థానికులను వేధిస్తున్నాయి. తాగునీరు, రోడ్లు, మురుగు కాల్వలు, వీధిదీపాల నిర్వహణ వ్యవస్థ సవ్యంగా లేక ప్రజలు రోజూ అవస్థలు పడుతున్నారు.

అవస్థలు పడుతున్న ప్రజానీకం

✿ రైల్వేస్టేషన్ రోడ్డు మార్గంలోని వ్యాపార, వాణిజ్యవర్గాల ప్రజలు, నిత్యం తారకరామ సాగర్, వావిలాల స్మృతి వనాలకు నడక, రన్నింగ్, యోగ సాధనకు వెళ్లేవారు అధ్వాన రోడ్డుతో ఇబ్బంది పడుతున్నారు. మీ-సేవ కేంద్రం నుంచి ప్రధాన రహదారి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది.

✿ రంగా కాలనీలో మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంతో దోమలు వ్యాప్తిచెంది జ్వరాలతో ఈ ఏడాది ఎక్కువ మంది ఆసుపత్రుల పాలయ్యారు. ఇప్పటికి కాలానుగుణ వ్యాధుల బెడద తప్పలేదు. పాత, నూతన సుగాలి కాలనీలు, రంగా కాలనిలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వీధి దీపాల నిర్వహణ వ్యవస్థ కూడా అక్కడ సక్రమంగా లేదు. సమస్యలకు అలవాలంగా లెనిన్‌నగర్ ఉంది. అంబేడ్కర్ నగర్, ఫణిదం చేనేత సొసైటీ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాల్సి ఉంది.



గుంతలతో అధ్వానంగా రైల్వేస్టేషన్ రోడ్డు

✿ ముస్లింపేట, అచ్చంపేట రోడ్డు మార్గాల్లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. పైపులైన్లు లేక తాగునీటి సమస్య ముస్లింపేట వాసుల్ని రోజూ ఇబ్బందిపెడుతోంది. ఇళ్ల ముందు డబ్బాలతో నీళ్లు పట్టుకోవాల్సి వస్తోంది. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.



భీమవరం రోడ్డులో రోడ్డు, డ్రెయిన్‌లేని వీధి



ముస్లింపేటలోని షాదీఖానాలో అధ్వాన పారిశుద్ధ్యం

ఆ ముళ్లను నమ్ముకుంటే అంతే సంగతులు

పల్నాడు ముఖద్వారంగా ఉన్న సత్తెనపల్లి పట్టణానికి ఐకానిక్‌గా ఉన్న గడియార స్తంభంలోని గడియారాలు సక్రమంగా పనిచేయట్లేదు. గడియార స్తంభానికి నలువైపులా ఏర్పాటు చేసిన గడియారాల్లో ఎప్పుడూ రెండు, మూడు పని చేయట్లేదు. పట్టణ ప్రజలు సమయం కోసం వాటిని నమ్ముకుంటే తప్పులో కాలేయాల్సిన పరిస్థితి ఉంటుంది. **-న్యూస్‌టుడే, సత్తెనపల్లి**




తూర్పు వైపు పనిచేయని గడియారం

వెంకటరత్నం మృతికి నివాళి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన సున్నం వ్యాపారి అమరనేని వెంకటరత్నం చౌదరి (77) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. వెంకటరత్నం చౌదరి మృతదేహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

రెంటచింతల, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన పాలువాయి గేటు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పాలువాయి గేటుకు చెందన జెవిశెట్టి శ్రీను(40) పొలం నుంచి ద్విచక్రవాహనంపై గేటుకు వస్తున్నాడు. మాచర్ల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి 20 రోజుల క్రితం వెంకయ్య వృద్ధాప్యంతో చనిపోయాడు. ఈలోపే ఈఘటన చోటు చేసుకోవడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. ఎస్సై నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శ్రీను (పాతచిత్రం)

రహదారులు అధ్వానం.. ప్రజలు సతమతం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని భవానీ నగర్‌లో నాలుగు రోడ్లు అధ్వానంగా మారడంతో వర్షాకాలం వచ్చిందంటే బురదలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. కనక దుర్గమ్మ గుడి వెనుక ప్రాంతంలో కొంతమంది నూతనంగా ఇళ్లు నిర్మించుకున్నారు. కనీసం మట్టి రోడ్డు కూడా లేకపోవడంతో బురదలోనే వెళ్లాల్సి వస్తోందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కాలనీలో ఒక్క రోడ్డు కూడా నిర్మించ లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా భవానీ నగర్‌లో ఆధ్వానంగా ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చాలని, డ్రైనేజీలు కట్టాలని స్థానికులు కోరుతున్నారు.



భవానీ నగర్‌లో అధ్వానంగా రోడ్డు



మాయాబజారులో వాహన రద్దీ

మాయాబజారులో ట్రాఫిక్ రద్దీ

పట్టణంలోని మాయాబజారులో బంగారు దుకాణాలు, జనరల్ స్టోర్స్, ఇత్తడి, స్టీలు సామగ్రి విక్రయించే దుకాణాలు ఎక్కువగా ఉండటంతో పట్టణం, పరిసర గ్రామాల నుంచి ప్రజలు ఇక్కడకు వస్తారు. రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టడం, దుకాణాల్లో సామగ్రి రోడ్డు మీద పెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని దుకాణాల్లో సామగ్రి రోడ్డు మీద పెట్టకుండా ఉండటంతో పాటు రోడ్డు మధ్యభాగంలో క్రమపద్ధతిలో వాహనాలు నిలపడానికి మార్కింగ్ ఇవ్వాలని కోరుతున్నారు.